# కోరుకో...ఇచ్చుకో

-కె.విజయలక్ష్మి

నాకు చాలా టెన్షన్‌గా ఉంది. ఈ సమ్మర్‌కి ట్రాన్స్‌ఫర్ వస్తుంది. అదే నా టెన్షన్‌కి కారణం. ఈ వూరొచ్చి నాలుగేళ్లు పూర్తవుతోంది. మా అబ్బాయిలిద్దరూ ప్రకాశ్, శ్రీనివాస్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్‌కి రాబోతున్నారు. ఈ టైమ్‌లో ట్రాన్స్‌ఫర్ వస్తే పిల్లలిద్దరి చదువులు ఎలా? ఈ విషయమే నన్ను భూతంలా భయపెడుతోంది.

ఒక రూమ్ అద్దెకు తీసుకుని వారిద్దర్ని అందులో వుంచి మెస్ భోజనం ఏర్పాటు చేయవచ్చు. కానీ ఆ ఊహే భరించరానిదిగా ఉంది. ఖర్చు నా తలకు మించినదే అయినా ఎలాగో తిప్పలు పడవచ్చు. కానీ పిల్లలు ఇంతవరకూ ఎప్పుడూ వేరే ఊరిలో హాస్టల్‌లో ఉండి చదవలేదు. భోజన సౌకర్యవంతంగా ఉంటుందో లేదో కూడా తెలీదు.

నేనొక సెంట్రల్ గవర్నమెంట్ ఆఫీసులో క్లర్క్‌గా పని చేస్తున్నాను. మాది బల్లకింద చెయ్యి పెట్టే డిపార్ట్‌మెంట్ కాదని ఒకప్పటి పేరు. కానీ ఇప్పుడు ట్రెండ్ మారిపోయింది. మనకి ఆ ఆలోచనలు ఉండాలేగానీ అందుకు అవకాశాలు కోకొల్లలని అనేక ఉదాహరణల ద్వారా తేటతెల్లమవుతోంది. నేను మాత్రం నూటికి నూరుశాతం లంచానికి వ్యతిరేకిని. మడికట్టుకుని కూర్చున్నానని చెప్పడంకాదుగానీ నేను నమ్మిన సిద్ధాంతాలకి కట్టుబడి ఉంటానని మాత్రం గట్టిగా చెప్పగలను. ఫైనాన్షియల్‌గా నా పరిస్థితి టైట్ కాబట్టి నా పిల్లలు కాన్వెంట్లకి, కార్పొరేట్ కాలేజీకి దూరంగా పెరిగారు.

సరస్వతీ కటాక్షంవల్ల గవర్నమెంట్ స్కూల్‌లోను, కాలేజీలోనూ చదివి మంచి ర్యాంకులు తెచ్చుకుని ఇదిగో ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరంలోకి రాబోతున్నారు.

నా పిల్లల స్వేచ్ఛను దుర్వినియోగం చేసే వాళ్లు కాకపోయినా బాధ్యతగల తండ్రిగా నా భయాలు నాకుంటాయి. ఈ ఏజ్‌లో ముఖ్యంగా ఫ్రెండ్స్ ప్రభావం బాగా వుంటుంది. టీనేజ్‌లో పేరెంట్స్‌కి దూరంగా రాగానే రెక్కలొచ్చిన స్వేచ్ఛా విహంగాల్లా ఫీలవుతారు. ఆడా మగా స్నేహాలు.. మందులు... ఇలా ఎన్నో వింటున్నాను. ఖర్చు కంటే ఈ భయమే నన్ను ఎక్కువగా భయపెడుతోంది. ఇప్పటివరకూ ఉద్యోగికి దూర భూమిలేదు అని నమ్మినవాడ్ని కాబట్టి ఎక్కడికి ట్రాన్స్‌ఫర్ అయినా సంతోషంగా వెళ్లి జాయిన్ అయ్యేవాడ్ని. మొదటిసారిగా పిల్లల కోసం మరో సంవత్సరం ఇక్కడే కొనసాగే ఆల్టర్‌నేట్ ఏదైనా ఉందా? ఒకవేళ అలాంటిది ఉంటే అధికార్లని బతిమాలి ఇక్కడే ఉండేట్లు చూడాలి.

ఆ ఆలోచన రాగానే కాస్త రిలీఫ్‌గా అనిపించింది. చుట్టూ చూసాను. వైదేహి గాఢనిద్రలో వుంది. పిల్లలు ఎప్పుడు చదువు ముగించారో వాళ్లూ నిద్ర పోతున్నారు. తెల్లవారురుఝామున్ముకి కాస్త కునుకు పట్టింది.

★★★

తెల్లవారి ఆఫీసులో తీరిక చూసుకుని నా కొలీగ్ ఈ నాలుగేళ్లల్లో నాతో కాస్త క్లోజ్‌గా ఉండే ఫ్రెండ్ ముందు నా సమస్యను వుంచాను.

నా మాటలు విని ఆనందరావు 'ఎంత అమాయకుడివి' అన్నట్లు పెద్దగా నవ్వాడు. ఆ నవ్వుకి అర్థం తెలీక అతనివైపు అదోలా చూసాను.

"ఏమిటి రామారావ్! మరీ ఇంత చిన్న విషయానికి అంతర్జాతీయ సమస్యలా అంతలా బుర్ర బద్దలు కొట్టుకోవాలా? ఈ సమస్య నుండి బయటపడడం వెరీ సింపుల్" అన్నాడు

నాకు డిపార్ట్‌మెంటల్‌గా ఎవరితోనూ పెద్ద పరిచయాలులేవు. నా వర్క్ ఫర్‌ఫెక్ట్‌గా చేస్తాను. ఎప్పుడూ వర్క్ పెండింగ్ లేకుండా ఉంచుకుంటాను. అనవసరమైన విషయాల జోలికి పోను. ఆఫీసు రాజకీయాలు అస్సలు పట్టించుకోను. అందుచేత ఎవరితో డీల్ చేయాలో, ఎలా మొదలుపెట్టాలో, నా ప్రాబ్లమ్ ఎలా సాల్వ్ చేసుకోవాలో అర్థం కాకుండా ఉంది. ఏతావాతా నాకు తెలిసిందేమిటంటే లౌక్యం, లోకజ్ఞానం తక్కువని నాకే అర్థమయింది. ఇక ఆనందరావుకి అర్థం కాకుండా ఎలా వుంటుంది? అందుకే మళ్లీ తనే అన్నాడు.

"కోరుకో, ఇచ్చుకో పథకం ఉందికదా. దాని ద్వారా నీ ప్రాబ్లమ్ ఈజీగా సాల్వ్ అవుతుంది. దట్సాల్" సిగరెట్ వెలిగించి పొగ రింగులు రింగులుగా గాల్లోకి వదులుతూ చిద్విలాసంగా అన్నాడు.

నాకంతా అయోమయంగా ఉంది. అదేం పథకం? ఆరోగ్యశ్రీ పథకం, దీపం పథకం, రైతులకి భీమా పథకం, ఇంకా ఆ పథకం, ఈ పథకం అంటూ ఏవేవో చాలా పథకాలు గవర్నమెంటు ఇంప్లిమెంట్ చేస్తోంది. వాటి గురించి పేపర్లో చదివానుగానీ 'కోరుకో ఇచ్చుకో' అనే పథకం పేరు నేనస్సలు వినలేదు. న్యూస్‌పేపర్లో చదవలేదు. ఛ...ఛ... మరీ అందరికీ తెలిసిన విషయం కూడా నాకు తెలీకుండా పోయింది. బావిలో కప్పలా బతుకుతున్నాను. నా అజ్ఞానానికి నన్ను నేను తిట్టుకున్నాను.

"కోరుకో ఇచ్చుకో...అదేం పథకం?" అడిగాను. ఆనందరావు నావైపు ఎగాదిగా చూసి-

"అయ్యో... నువ్వెక్కడో సత్యకాలం మనిషిలా ఉన్నావే? మన క్యాంపు క్లర్క్‌ని కలిసి ట్రాన్స్‌ఫర్ క్యాన్సిల్ చేసుకోవాలో, లేక వేరే నీకేదైనా ఇష్టమైన ఊరు కావాలో చెప్పు. అతనడిగింది ఇవ్వు అంతే. ఇహ నీ బాధ్యతంతా అతని భుజస్కందాల మీద వేసుకుని పై అధికారులతో మాట్లాడి నీకు ఫేవర్‌గా చేస్తాడు. కాకపోతే ఒక్కో పనికి ఒక్కో రేటు వుంటుంది. మనకి అధికారులకి మధ్య అతను మీడియేటర్‌గా పని చేస్తాడన్నమాట. అతనికి కొంత వాటా ఉంటుంది. ఇదే

ప్రస్తుతం మన డిపార్ట్‌మెంట్‌లో అమలుపరుస్తున్న 'కోరుకో...ఇచ్చుకో' అనే బృహత్‌పథకం'' రహస్యం చెప్పి అదోలా కళ్ళెగరేసాడు ఆనందరావు.

"ఎంత అన్యాయం... మన ఇబ్బందులని, అవసరాలని క్యాష్‌గా మార్చుకుంటున్నారా? అంటే ఇప్పుడు నేను లంచం ఇవ్వాలా'' మొహం అదోలా పెట్టి కోపంగా అన్నాను.

నాకు లంచం తీసుకోవడం, ఇవ్వడం రెండూ ఇష్టంలేదు. అలా అని నా కోపం ఎవరిమీద? నాకోపం నాకే సిల్లీగా అన్పించింది.

"తప్పదు రామారావ్! పరిస్థితి మనకి అనుకూలంగా లేనప్పుడు మరో దారి వెతుక్కోక తప్పదు. డైలీ సర్వీస్ చేయడం కుదరకపోవచ్చు. పోనీ మీ ఆవిడ్ని, పిల్లల్ని ఇక్కడే ఉంచి నువ్వక్కడ ఉండాలంటే మన జీతాలతో మెయిన్‌టైన్ చేయడం కష్టం. పిల్లల్ని ఇక్కడ రూంలో ఉంచాలంటే నువ్వు భయపడుతున్నట్లుగానే నేటి యువత పరిస్థితి దారుణంగా ఉంది. పేరెంట్స్‌తో కలసి ఇంట్లోనే ఉండే పిల్లలు బెటరుగా ఉంటారు'' ఇంకా ఆనందరావు ఏవేవో చెబుతూనే ఉన్నాడు.

నేను సగటు మనిషినే. నా కుటుంబ సుఖసౌఖ్యాల తరువాతే ఏ సిద్ధాంతమైనా? రూల్సయినా? 'కోరుకో...ఇచ్చుకో' పథకంలో మెంబర్ కావాలని గట్టిగా నిర్ణయించుకున్నాను.

★

